సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



మూషికాలతో ముప్పు

పంటలకు ఎలుకలతో ముప్పు పొంచి ఉంది. వీటి నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- 8లో



జాతరో జాతర..

కోటబొమ్మాళిలో కొత్తమ్మ తల్లి జాతర 1వ తేదీ నుంచి జరగనుంది. విద్యుత్ అలంకరణలు చేశారు.

- 8లో

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు సర్వే..

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో కొత్తగా స్మార్ట్ విద్యుత్ మీటర్లను అమర్చేందుకు ఆదివారం విద్యుత్ శాఖాధికారులు పాత మీటర్లపై సర్వే చేపట్టారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లకు ముందుగానే రీచార్జి చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, పెట్రోల్ బంకులు, రైస్‌మిల్లులకు కొత్త స్మార్ట్ విద్యుత్ మీటర్లను త్వరలో అమర్చనున్నామని విద్యుత్‌శాఖ ఏఈ బీవీ సురేష్ ఆదివారం తెలిపారు.

న్యూస్‌రీల్

ఎస్‌ఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న తొమ్మిది మంది ఎస్‌ఐలను జిల్లాకేంద్రంలోనే వివిధ పోలీసు విభాగాలకు స్థానచలనం చేస్తున్నట్లు విశాఖ రేంజి డీఐజీ గోపినాథ్ జట్టి జిల్లా పోలీసు కార్యాలయానికి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో పి.పారినాయుడు (స్పెషల్ బ్రాంచి), కె.మధుసూదనరావు (సెంట్రల్ క్రైమ్), కె.కృష్ణప్రసాద్ (సెంట్రల్ క్రైమ్), పి.సిద్ధార్థకుమార్ (ట్రైనింగ్‌సెంటర్ అటాచ్డ్ టాస్క్‌ఫోర్స్), టి.రాజేష్ (ట్రైనింగ్ సెంటర్ అటాచ్డ్ టాస్క్‌ఫోర్స్), వి.రవికుమార్ (ట్రైనింగ్ సెంటర్), పి.కిషోర్‌వర్మ (కంట్రోల్‌రూమ్), ఎ. కోటేశ్వరరావు (కంట్రోల్‌రూమ్ అటాచ్డ్ ట్రాఫిక్ రికార్డ్‌బ్యూరో), ఎండీ అమీర్‌ఆలీ (క్రైమ్ రికార్డ్ బ్యూరో)లు ఉన్నారు.

ఉత్తరాంధ్రకు రూ.వెయ్యి కోట్లు ఇవ్వాలి



టెక్కలిలో ర్యాలీ చేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ ప్రతినిధులు

టెక్కలి: ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు ఇవ్వాలని, దీనికి కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ జగన్నాథం అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వరరావు, వంకల మాధవరావు ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలో ఉత్తరాంధ్ర వెనకబాటు–పాలకుల నిర్లక్ష్యం అనే అంశంపై ర్యాలీ, సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో భూములన్నీ అన్యాక్రాంతం చేసే విధంగా దోపిడీలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం నుంచి ఇచ్ఛాపురం వరకు సాగునీటిని అందజేయాలని, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని, ప్రభుత్వ భూములను నిరుపేద రైతులకు, గిరిజనులకు పంపిణీ చేయాలని, మత్స్యకారులకు కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రజా సంఘాలకు చెందిన జుత్తు వీరా స్వామి, ఎం.వినోద్, ఎం.భీమారావు, రామారావు, ఈశ్వరమ్మ, ఎస్.బంగ్గాకుమార్, శ్రీను పాల్గొన్నారు.

అరసవల్లిలో భక్తుల సందడి



ఆరోగ్యం కోసం సూర్య నమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో భాద్రపద ఆదివారం సందర్భంగా భక్తులు సందడి చేశారు. గ్రామీణ ప్రాంతాల మహిళలు కుటుంబాలతో తరలివచ్చి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టగా స్వామి వారిని ప్రత్యేక దర్శన మార్గాల్లో దర్శించుకున్న భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో భద్రాజీ, సూపరింటెండెంట్ కనకరాజు తదితర సిబ్బంది అంతా కొత్తగా విధుల్లో చేరడంతో తొలిసారిగా ఆదివారం భక్తుల దర్శనాల ఏర్పాట్లను, ఆలయంలో వివిధ విభాగాల పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1.00.700, పూజలు, విరాళాల ద్వారా రూ.73,096, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.57లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈవో భద్రాజీ తెలియజేశారు.

బైక్ ఢీకొని మత్స్యకారుడు మృతి



దేవ బెహరా (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: తెల్లవారుజామున చేపలు పట్టుకునేందుకు వెళ్తున్న స్వదేశీ మత్స్యకారుడిని బైక్ ఢీ కొనడంతో ఆయన మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈదుపురం గ్రామానికి చెందిన దేవ బెహరా(65) అనే స్వదేశీ మత్స్యకారుడు బహుదా నదిలో చేపలు పట్టేందుకు ఆదివారం తెల్లవారుజామున వెళ్తుండగా, కవిటి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ఆదినారాయణ అనే యువకుడు బైక్‌పై ఇచ్ఛాపురం వెళ్తూ బహుదానది వంతెనపై వెనుక నుంచి దేవను బలంగా ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య సబితి, నలుగురు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి శవ పంచనామాకు తరలించినట్లు ఎస్ఐ ఈ.శ్రీనివాస్ తెలిపారు.

గోధూళి వేళాయె..



నిమ్మళంగా ప్రవహించే నాగావళి.. ఇసుక తిన్నెల పైనుంచి సుతారంగా వెళ్లే సందె గాలి.. పొద్దంతా పనిచేసిన అలసటతో పడమటలోకి వాలిపోతున్న ఆదిత్యుడు.. శ్రీకాకుళం సమీపంలోని తమ్మినాయుడుపేట వద్ద గల బ్రిడ్జి వద్ద ఈ సుమనోహర దృశ్యం ఆవిష్కృతమైంది. అరుణకిరణ కాంతుల్లో యువకులు ఆ తిన్నెలపై ఆడుకుంటూ సేద తీరారు. - శ్రీకాకుళం రూరల్

1, 2 తేదీల్లో కిరణ దర్శనం



మూలవిరాట్టుపై కిరణాల వెలుగులు (ఫైల్)

అరసవల్లి: అద్భుత కిరణ దర్శన సమయం వచ్చేసింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరాయణ, దక్షిణాయణ కాలమార్పుల్లో భాగంగా తొలి సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్టును స్పృశించే అరుదైన క్షణాలు అక్టోబర్ 1, 2 తేదీల్లో సూర్యోదయ సమయాన సాక్షాత్కరించనున్నాయి. ఏటా మార్చి 9, 10 తేదీల్లోనూ, అలాగే అక్టోబర్ 1,2 తేదీల్లో సూర్యోదయ సమయంలో నేరుగా సూర్యకిరణాలు గర్భాలయంలోని స్వామి వారి మూలవిరాట్టును తాకడం ఇక్కడి క్షేత్ర మహత్యంగా చెబుతుంటారు. ఈ మేరకు ఆలయంలో దర్శన ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నట్లుగా ఈఓ వై.భద్రాజీ, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆదివారం తెలియజేశారు. అయితే ఆకాశం మేఘావృతం అయితే కిరణాలు తాకే అద్భుత దృశ్యం కనిపించదని వెల్లడించారు. కిరణ దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ముందుగా అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్నారు. ఇందుకుగాను అనివెట్టి మండ పం నుంచి మహా మండపం వరకు బారికేడ్ల ఏర్పాటు పనులను సోమవారం సాయంత్రానికే పూర్తిచేసేలా చర్యలు చేపట్టనున్నారు.

ఆ నివేదిక.. అక్రమాలకు వేదిక



- అభియోగాలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని తప్పించేందుకు కీలక అధికారి యత్నాలు
- ఏకంగా నివేదికను కలెక్టరే మార్చమన్నారంటూ నెపం
- నివేదిక మార్చాలంటూ విచారణకు వెళ్లిన అధికారులపై తీవ్రమైన ఒత్తిళ్లు



జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయం

అరసవల్లి:

జిల్లా వైద్యారోగ్య శాఖకు అవినీతి, అక్రమాల జబ్బు పట్టేసింది. ఈ శాఖకు చెందిన ఓ కీలక అధికారి మాటలకు, చేష్టలకు ఏ మాత్రం పొంతన కనిపించడం లేదు. తాజా ఘటన ఇందుకు ప్రధాన సాక్ష్యం. నగరానికి చెందిన ఓ బాధితురాలు ఉద్యోగం పేరుతో మోసపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే... అందుకు కారకులకు శిక్ష పడేలా కాకుండా వారిని రక్షించే బాధ్యతలను కీలక అధికారులు తమ భుజాలపై వేసుకున్నారు. శాఖాపరంగా విచారణకు ఆదేశించిన అధికారే ఇప్పుడు ఆ నివేదికను మార్చేసినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. నివేదికను వైద్య ఉద్యోగులకే అనుకూలంగా మార్చుకుని కలెక్టర్‌కు నివేదించినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ విషయం తెలుసుకున్న బాధితురాలి గోడు వర్ణనాతీతంగా ఉంది. ఉద్యోగమిప్పిస్తానని ఒకడు, న్యాయం చేస్తామని మరొకరు తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివేదిక మార్చాలని ఒత్తిడి

ఆత్మహత్యకు పాల్పడిన మహిళను రిమ్స్‌లోనే పరామర్శించిన విచారణాధికారి డాక్టర్ తాడేల శ్రీకాంత్ ఆధ్వర్యంలో శాఖ బృందం ఈనెల 23న విచారణ చేసింది. అందులో భాగంగా ఆమె నుంచి లిఖితపూర్వక వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. అలాగే ఆమె లిఖితపూర్వకంగా పేర్కొన్న పలు సంచలన విషయాలను కూడా రికార్డు చేసుకున్నారు. తాను జీవీ నరసింహంకు రూ.2 లక్షలు, మరో కీలక అధికారికి రూ.లక్ష నగదును ఇచ్చానని, ఫేక్ జాయినింగ్ ఆర్డర్ ఇచ్చి తనను మోసం చేసిన క్రమాన్ని లిఖిత పూర్వకంగా విచారణాధికారికి ఆమె అందజేశారు. అనంతరం విచారణ పూర్తయిన తర్వాత నిజానికి పూర్తి నివేదికను ఎలాంటి మార్పులు లేకుండా కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంది. అయితే ఈ నెల 23న విచారణ జరిగితే 28వ తేదీ వరకు కలెక్టర్ చేతికి నివేదిక వెళ్లకపోవడంతోనే పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇక్కడే వైద్యాశాఖాధికారులు తమదైన శైలిలో నివేదికను మార్చేశారనే అనుమానాలు బలపడ్డాయి. విచారణ నివేదికను మార్చే కుట్రకు తాను సహకరించేది లేదంటూ విచారణ బృందంలోని ఓ కీలక అధికారి తేల్చిచెప్పడంతో ఎలాగైనా 'మన వాళ్లను' రక్షించేందుకు ఆ కీలక అధికారి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దీని కోసం ఏకంగా కలెక్టర్ పేరును కూడా వాడేశారని తెలుస్తోంది.

కలెక్టరే మార్చమన్నారంటూ..

విచారణ బృందంలో ఓ అధికారి విచారణ నివేదికను మార్చేందుకు ససేమిరా అనడంతో ఆ కీలక అధికారి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా ఏకంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పేరునే వాడేశారట. బాధితురాలు ఇచ్చిన నివేదిక విషయంలో స్వయంగా కలెక్టరే నివేదికను మార్చేయమన్నారని 'బాధితురాలి నుంచి డబ్బులు తీసుకున్నది ఇద్దరు కాదు.. ఒక్కరే అన్నట్లుగా..' మార్చాలంటూ సూచించారని చెప్పుకొచ్చారు. ఇలాంటి మాల్‌ప్రాక్టీస్ పనులతో అక్రమార్కులను కాపాడే యత్నంలో ఏకంగా కలెక్టర్ పేరునే ఆ కీలక అధికారి వాడేశారనే ప్రచారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మారుమోగిపోవడంతో ఈ నివేదికాంశం తీవ్ర చర్చల్లోకి వెళ్లింది. ఇదే విషయం బాధితురాలి చెవిలో పడటంతో తనకు అన్యాయం చేస్తున్నారని, ఆఖరికి ఉన్నతాధికారులు కూడా మోసం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో తమకు న్యాయం జరగకపోతే ముఖ్యమంత్రి వరకు తీసుకెళ్తామని బాధితురాలి కుటుంబసభ్యులు అంటున్నారు. ఏదీ ఏమైనా ఉన్నతాధికారులు ఈ విషయంలో విచారించి బాధితురాలికి న్యాయం చేయాలని ఆమె బంధువులు, స్థానికులు కోరుతున్నారు.

కుక్కకాటుకు మందు కరువు





సోంపేట సామాజిక ఆస్పత్రి

సోంపేట: సామాజిక ఆస్పత్రుల్లో కుక్కకాటు మందులు దొరకడం లేదు. మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన బత్తిని నీలవేణిని ఆదివారం కుక్క కరిచింది. దీంతో కొర్లాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసి సోంపేట సామాజిక ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడకు వెళ్లాక కుక్కకాటు ఇంజెక్షన్ లేదని సిబ్బంది చెప్పడం గమనార్హం. ఇక్కడి నుంచి హరిపురం తీసుకెళ్లాలని చెప్పడంతో చేసేదేమీ లేక కుటుంబ సభ్యులు హరిపురం తరలించారు. సోంపేట సామాజిక ఆస్పత్రిపై మూడు మండలాల ప్రజలు ఆధార పడి ఉంటారని, అలాంటి ఆస్పత్రిలో కుక్క కాటు మందులు అందుబాటులో లేకపోవడం దారుణమని పరిసర గ్రామ ప్రజలంటున్నారు. వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

పాత పెన్షన్ ఎప్పుడు అమలు చేస్తారు..?



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్. పక్కనే జిల్లాశాఖ బాధ్యులు

శ్రీకాకుళం న్యూకాలనీ: గత ప్రభుత్వం తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్ పథకాన్ని సమీక్షించి మెరుగైన పింఛను విధానాన్ని ప్రవేశపెడతామంటూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ఏమైందని? పాత పెన్షన్ విధానాన్ని అమలుచేసే తేదీని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని క్రాంతిభవన్‌లో ఆదివారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత పాలపక్షం అనుసరిస్తోందన్నారు. జీపీఎస్‌ను రద్దు చేసి అక్టోబర్ ఒకటో తేదీ నుంచే పాతపెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇదే నెలలో చేసిన పని సర్దుబాటులో ప్రాథమికోన్నత పాఠశాలలో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను, భాషా పండితులను మిగులుగా చూపించి సమీప ఉన్నత పాఠశాలలో సర్దుబాటు చేసి రానున్న విద్యా సంవత్సరానికి ఆ బడులను మూత వేయడానికి కసరత్తు చేయడం ప్రభుత్వ దుర్మార్గపు ఎత్తుగడగా కనిపిస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తమ్మినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల సముదాయాల రీ ఆర్గనైజేషన్ పేరిట క్లస్టర్ పాఠశాల వ్యవస్థకు నాంది పలుకుతున్నారని, ఇది మూసివేతకు చేస్తున్న కసరత్తు అని తెలిపారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి పి.రామకృష్ణ, సీనియర్ నాయకులు రాధాకృష్ణ, రామారావు, జి.రమణ, కె.శ్రీనివాసరావు, పలు మండలాల శాఖల ప్రతినిధులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దళితుల రాజ్యాధికారం కోసం పార్టీ స్థాపిస్తాం

- మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్

టెక్కలి: దళితుల ఓట్లతో గద్దెనెక్కుతున్న వారు అధికారం దక్కించుకున్న తర్వాత దళితులను చిన్న చూపు చూస్తున్నారని, దళితుల రాజ్యాధికారం కోసం ప్రత్యేకంగా రాజకీయ పార్టీ స్థాపిస్తామని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోకర నారాయణరావు, చల్లా రామారావుతో పాటు ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలో నిర్వహించిన దళిత ఆదివాసీల సదస్సుకు హర్షకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులంతా ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించామన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ ఫలాలను దళిత, ఆదివాసీలకు అందకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఐకమత్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

మాల మహానాడు వ్యవస్థాపకుడు కేబీఆర్ అంబేడ్కర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పక్కన పెట్టి లడ్డూ కల్తీ అంటూ విమర్శలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. 59 ఉప కులాలుగా ఉన్న దళితులు రాజకీయంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టెక్కలి ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ, సినీ నిర్మాత బలగ ప్రకాశ్, వివిధ దళిత సంఘాలకు చెందిన రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

తుది దశకు స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు



నెట్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు తుది దశకు చేరుకున్నాయి. మరికొన్ని క్రీడాంశాల్లో మాత్రమే ఎంపికలు మిగిలి ఉన్నాయి. విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపికల్లో భాగంగా ఆదివారం స్కేటింగ్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులో స్కేటింగ్, పాత్రునివలస మినీ స్టేడియంలో హ్యాండ్‌బాల్, టెక్కలిలో నెట్‌బాల్, రగ్బీ, రోప్ స్కిప్పింగ్ పోటీలను నిర్వహించారు.

ఉల్లాసంగా స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బీవీ రమణ పర్యవేక్షణలో అండర్ 14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు ప్రత్యేకంగా నెట్‌బాల్, రగ్బీ, స్కిప్పింగ్ తదితర క్రీడల్లో ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 550 మంది విద్యార్థులు హాజరయ్యారు.



శ్రీకాకుళం 80ఫీట్ రోడ్డులో స్కేటింగ్‌లో దూసుకెళ్తున్న అండర్–14 బాలబాలికలు



రగ్బీ క్రీడాకారుల ఎంపిక జరుగుతున్న దృశ్యం

ఈవ్‌టీజింగ్ కేసు నమోదు

కాశీబుగ్గ: అమ్మాయిని ఈవ్ టీజింగ్ చేసినందుకు నలుగురు యువకులపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ కాలేజీ అమ్మాయిని నలుగురు యువకులు శనివారం సాయంత్రం బస్సులో వేధించడంతో ఆమె 100కు కాల్ చేసి విషయం చెప్పింది. కాశీబుగ్గ పోలీసులు స్పందించి నలుగురు యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వీరు పలాస మండలం అమలకుడియా పంచాయతీకి చెందిన వారు. ప్రతి రోజు కళాశాల విడిచిపెట్టిన సమయంలో రాకపోకలు చేసే బస్సులో ఇదే తంతుగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

గగుర్పాటు..

ఓ భారీ నాగుపాము మరో నాగు పామును అమాంతంగా మింగేసిన ఘటన పలాస రైల్వే కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే కాలనీలో ఎస్సీ, ఎస్టీ కార్యాలయం గేటు దగ్గర రెండు పాముల మధ్య భీకరమైన పోరు జరుగుతున్నట్లు రైల్వే పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు గుర్తించారు. వాటిని దగ్గర నుంచి పరిశీలించగా ఒక పామును మరో భారీ నాగుపాము నోట కరిచి మింగేస్తోంది. ఈ దృశ్యం వారికి గగుర్పాటును కలిగించింది. భారీ నాగుపాము అక్కడే తిష్ట వేయడంతో అటవీ శాఖాధికారులకు స్థానికులు సమాచారమిచ్చారు. కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీ కృష్ణమనాయుడు ఆదేశాల మేరకు ఈస్టర్న్ గార్డ్ వైల్డ్ లైఫ్ సొసైటీకి చెందిన స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడీ భారీ నాగుపామును పట్టుకుని కోసంగిపురం సమీపంలోని అటవీప్రాంతంలో విడిచి పెట్టారు. కోబ్రా జాతి సంతతికి చెందిన సర్పాల మధ్య ఆహార అన్వేషణలో చిన్న పాము పెద్దపాముకు ఆహారం అవడం సాధారణమని అన్నారు. - కాశీబుగ్గ



చిన్నపామును మింగుతున్న మరోపాము



పామును తన ఆధీనంలోకి తీసుకుంటున్న స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడీ

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు

సారవకోట: మండలంలో మూగుపురం గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన కేసులో ఆ గ్రామానికి చెందిన బుద్దల హేమసుందరరావును శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీకాకుళం మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రాజశేఖర్ విచారణ చేపట్టి యువకుడిని అరెస్టు చేసి పాతపట్నం కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆర్‌జీయూకేటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం పట్టణంలో ఈ నెల 28వ తేదీన జరిగిన జిల్లాస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ ద్వారా ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన తరుణ్‌కుమార్, మహబూబ్, మనోజ్ కుమార్‌లను క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ముగ్గురికి పతకాలు



బ్యాడ్మింటన్ సంఘ జాతీయ ప్రతినిధులు, కోచ్ కోడి మోహన్‌తో జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎన్.ప్రవీణ్‌కుమార్, జి.చాయాకిరణ్, జి.జోత్స్న పతకాలు సొంతం చేసుకున్నారు. హరియాణాలోని రోతక్ వేదికగా ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగిన 43వ ఆలిండియా సబ్‌జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బాలురు జట్టు చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించగా, బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచి రజత పతకలు సాధించారు. జిల్లా నుంచి ఎన్.ప్రవీణ్‌కుమార్ (10వ తరగతి- జీహెచ్‌స్కూల్ ఎచ్చెర్ల), జి.చాయాకిరణ్ (10వ తరగతి- కాశీబుగ్గ గురుకుల ప్రైవేటు పాఠశాల) బాలురు జట్టుకు, బెండి జోత్స్న (10వ తరగతి- జెడ్పీహెచ్‌స్కూల్ ఒప్పంగి) బాలికల జట్టుకు ఆడి పతకాలు దక్కించుకున్నారు. వీరిలో ప్రవీణ్‌కుమార్ అత్యుత్తమ ఆటతీరును కనబర్చి స్టార్ ఆఫ్ ఇండియాకు ఎంపికయ్యాడు.

రూపక్ రెడ్డి కుటుంబానికి ఒడిశా ఎంపీ పరామర్శ



రూపక్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఒడిశా, ఆంధ్రా ప్రజాప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెదిని రవిరాజ్‌రెడ్డి కుమారుడు రూపక్‌రెడ్డి ఇటీవల అమెరికాలో ఓ ప్రమాదంలో చనిపోయారు. ఆయన స్వగ్రామం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పితాతొళిలో ఆదివారం జరిగిన సంస్మరణ సభకు ఒడిశా ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి, చీకటి ఎమ్మెల్యే మనోరంజన్‌దాస్‌లు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నర్తు నరేంద్ర యాదవ్‌తో కలసి రూపక్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

రామలింగేశ్వరునికి కిరణ స్పర్శ



బొరివంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో కిరణ స్పర్శిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని బొరివంకలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామిని తొలి సూర్యకిరణాలు స్పృశించాయి. ఆలయ గర్భగుడిలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలపై ఉదయం 6 గంటల సమయంలో ఐదు నిమిషాలపాటు ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది.

• 90 రోజుల పంట..




మండలంలోని పాతపట్నం, కొరసవాడ, సీది, తామర, తీమర తదితర గ్రామాల్లో పలువురు రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో క్యూ-7 రకం నెల్లూరు సన్నాలు సాగుచేశారు. పంట కాలం 90 రోజులు కావడంతో కోత దశకు చేరుకుంది. మరో పక్షం రోజుల్లో పంట కోస్తామని, ఎకరాకు 40 బస్తాలు వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. - పాతపట్నం

• జాతరో జాతర



కొత్తమ్మ తల్లి నిజరూపం



కోటబొమ్మాళి-కొత్తపేట మెయిన్ రోడ్డులో విద్యుత్ అలంకరణ



విద్యుత్ వెలుగుల్లో కొత్తమ్మ తల్లి గాలి గోపురం

కోటబొమ్మాళిలో కొత్తమ్మ తల్లి జాతర కోసం విద్యుత్ అలంకరణలు చేస్తున్నారు. దీంతో వీధులన్నీ సందడిగా కనిపిస్తున్నాయి. మంగళవారం నుంచి జాతర మొదలుకానుంది. - కోటబొమ్మాళి

మూషికాలతో ముప్పు



- పిలక దశలో ఉన్న వరి పైరు
- పైరును కొరికేస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్ వరిలో తీవ్ర నష్టం
- ఎలుకల పని పట్టేందుకు ఇదే అదును

పొలం గట్లుపై ఉండే ఎలుక బొరియలు

వజ్రపుకొత్తూరు: మూషికాలు అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను మూషికాలు తినేస్తూ దిగుబడిని తగ్గించేస్తాయి. దీంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. వాటి నివారణకు ఏం చేయాలో తోచక సతమతమవుతున్నారు. దీంతో మూషికాల బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో రాజమండ్రి వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు వివరించారు.

ఎలుకల దాడి ప్రారంభం

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 4,66,159.5 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో ప్రధానంగా స్వర్ణ, సాంబమసూరి రకాలకు చెందిన వరి పంటను మాత్రమే వేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా ఆగస్టు చివరి నాటికి ఉభాలు పూర్తి చేశారు. చాలా చోట్ల వెద పద్ధతి ద్వారా వరి నాటుకోవడంతో అవి వేగంగా పెరిగి దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు, పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళుతున్నాయి. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. జిల్లాలో ఎలుకలను నివారించే వ్యవస్థ లేకపోవడంతో రైతులకు ఏటా భయం తప్పడం లేదు. ఎలుకలను సామూహికంగా నివారించేందుకు ప్రభుత్వం ఎలుకలు పట్టే బుట్టలుగాని, బ్రోమోడయాలిన్ మందును గానీ పంపిణీ చేయాలి. కానీ నేటి వరకు జిల్లాలో అలాంటి చర్యలను వ్యవసాయ శాఖ చేపట్టలేదు.

నివారణకు ఏం చేయాలంటే..?

- గ్రామంలోని రైతులంతా కలిసి ఓ యూనిట్‌గా ఏర్పడి సామూహికంగా ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి.
- సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ 2 శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలను పొందవచ్చు.
- బ్రోమోడయోలిన్ '0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు 2 శాతం విషపు ఎర'గా తయారు చేసుకోవడం కోసం 96 పాళ్ల నూకలు 2 గ్రాముల నూనె, 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలపాలి.
- విషపు ఎర తయారు చేసే సమయంలో చేతులకు గ్లౌజులు లేదా పాలిథీన్ సంచి తొడుక్కోవాలి. లేదంటే మందులో ఉండే మనిషి చేతి వాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- ఒక్కో సజీవ ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి ఎలుక కన్నంలో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అమర్చిన అనంతరం బొరియను మూసి వేయకూడదు.
- భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే వర్షం ఆగేవరకు చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు.
- కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టి ఈ మిశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రంలోపు అమర్చాలి. ఎలుకలు నిశాచరులు కాబట్టి సాయంత్రం నుంచి మరసటి రోజుల ఉదయం వరకు స్వీకరించే అవకాశం ఉంది.
- ఎలుక మందు అమర్చిన అనంతరం మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజులకు ఎలుక చనిపోతుంది. ఈ మందు తిన్న ఎలుకల రక్తం గడ్డ కట్టదు అని రక్త స్రావమై రక్త హీనతతో చనిపోతాయి. కావున తదుపరి ఎలుకల బొరియల సంఖ్య నమోదు చేయాలంటే ఎలుక మందు అమర్చిన 7 నుంచి 10 రోజులు తర్వాత చేయాలి .



ఎలుక బొరియల్లోకి పొగను పంపిస్తున్న రైతులు

పొగ పెట్టాలి..

ఇదే విధంగా బొగబారించే యంత్రం (బర్రోఫ్యూమిగేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు ఎలుక బొరియల్లోకి పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల అనంతరం పంట భూమిని దుక్కి చేయాలి. రైతుల పొలంగట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎరను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. ఎలుక బొరియలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

తీవ్ర నష్టం..



మూషికాల విషయంలో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోంది. మన రాష్ట్రంలో ఏటా 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు అన్నదాతలు నష్టపోతున్నారు. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేందుకు ముందుకు రావాలి. ఇందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. విషపు ఎరలు పెట్టడంతో పాటు ట్రాపులు, పొగబారించే పద్ధతులు అవలంబించాలి. ముఖ్యంగా పొలం ఎలుక, చిట్టెలుకతో రైతులు జాగ్రత్త పడాలి.

- డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, శాస్త్రవేత్త కీటక శాస్త్ర విభాగం

రైతులు దృష్టి పెట్టాలి



ప్రస్తుతం ఎలుకలు నివారించేందుకు బ్రోమోడయోలిన్ మనకు ప్రభుత్వం నుంచి సరఫరా లేదు. రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా వీటిని నివారించుకోవాలి. వరి దుబ్బులు, తీపిగా ఉండడం వల్ల పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. ఎలుక బొరియలను గుర్తించి అందులో విషపు ఎరలు, ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి, ఎలుకల బుట్టలను సైతం ఉంచితే అవి చిక్కి పొలాల్లోకి వెళ్లవు. ఇది రైతులంతా సామూహికంగా చేపట్టాలి.

- ఎల్‌వీ మధు, ఏడీఏ పలాస

తండ్రి మృతి.. కూతుళ్లకు అనుమానం



తండ్రికి తలకొరివి పెడుతున్న ఇద్దరు కుమార్తెలు

పాతపట్నం: అంతరాబ గ్రామంలోని స్టూడెంట్ కాలనీవీధిలో నివాసం ఉంటున్న కమ్మకట్ల రామయ్య (83) శనివారం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కానీ ఆయన మృతిపై కూతుళ్లు అనుమానం వ్యక్తం చేశారు. వారు అనుమానం వ్యక్తం చేసింది తమ సోదరిపైనే కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. రామయ్యకు ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. రామయ్య భార్య చనిపోవడంతో చిన్నకుమార్తె సుగ్గ పుష్పలత తండ్రి వద్ద ఉంటూ బాగోగులు చూసుకుంటున్నారు. రామయ్యకు ఏడెకరాల పొలం, మూడు ఇళ్లు ఉన్నాయి. ఆస్తి విషయంలో పెద్ద కుమార్తె పరపతి లక్ష్మి, రెండో కుమార్తె ధర్మాన పద్మావతిలతో చిన్నకుమార్తెకు తరచూ గొడవలు జరిగేవి. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసుకున్నారు. పది రోజుల కింద చిన్నకుమార్తె తండ్రిని తన అక్కలకు తెలియకుండా గార మండలం వమ్మరవల్లిలోని తన అత్తవారింటికి తీసుకెళ్లింది. ఈ నెల 28న రామయ్యకు ఆరోగ్యం బాగులేకపోవడంతో రిమ్స్‌కు తీసుకెళ్లగా.. ఆయన అక్కడే చనిపోయారు. ఈ విషయాన్ని అక్కలకు పుష్పలత తెలియజేసి తండ్రి మృతదేహాన్ని అంతరాబ స్టూడెంట్ కాలనీకి తీసుకురాగా.. పద్మావతి, లక్ష్మిలు తమ సోదరిపై అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో పద్మావతి ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌కు తరలించి ఆదివారం ఉదయం పోస్టుమార్టం చేసి, బంధువుల సమక్షంలో మృతదేహాన్ని ముగ్గురు కుమార్తెలకు అప్పగించారు. తండ్రి మృతదేహానికి రెండో కుమార్తె పద్మావతి, చిన్న కుమార్తె పుష్పలత తలకొరివి పెట్టారు.

ఆంధ్రాలో మాయం.. ఒడిశాలో బేరం

- ద్విచక్ర వాహనాల నిందితుడు అరెస్టు
- 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పర్లాకిమిడి : మోటారుసైకిళ్లను చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసి 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ సునీల్‌కుమార్ మహంతి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 27న రాత్రి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ఫారెస్టు గేటు వద్ద ఎస్‌ఐ లక్ష్మణ్ బెహరా, సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బులెట్ బండిపై వస్తున్న ఇద్దరిని ఆపారు. వివరాలు ఆరా తీసి బైక్ నంబర్ ప్లేట్ ఓడీ67ఎ-8763ను పరిశీలించగా ఫేక్‌గా గుర్తించారు. పట్టుబడిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ శ్రీకాకుళం జిల్లా పలాసలో దొంగిలించినట్టు నిందితుడు రమిరి రఘునాథం అలియాస్ రఘు ప్రధాన్ అంగీకరించాడు. ఇతని స్వగ్రామం పలాస మండలం పెదంచల. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా.. అతని వద్ద మరో 18 ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ పలాస, పాతపట్నం పరిసర ప్రాంతాల్లో దొంగిలించినవని గుర్తించారు. ఆంధ్రాలో చోరీ చేసి నంబర్ ప్లేట్లు మార్చి ఒడిశాలో విక్రయిస్తుంటాడని విచారణలో తేలింది. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలిపారు. సమావేశంలో పాతపట్నం సీఐ ఎస్.సాయి, సబ్ డివిజన్ పోలీస్ అధికారి మాధవానంద నాయక్, ఎస్‌ఐ పంచాన బెహరా తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్ర సిలబస్‌ను తగ్గించాలి



ఏపీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా శాఖ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సాంఘిక శాస్త్ర(సోషల్ స్టడీస్) సిలబస్ విద్యార్థులకు అమితమైన భారంగా ఉందని, ప్రభుత్వం కనీసం వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భవన్‌లో ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు తులగాపు కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నైతిక విలువలు జోడించి విద్యార్థులకు పాఠాలు బోధించడం ద్వారా నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. ప్రతి పాఠశాలకు సాంఘిక శాస్త్ర ప్రయోగశాలలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తులగాపు కేశవరావు, బాదాన రాజు మాట్లాడుతూ సాంఘిక శాస్త్రంలో సిలబస్ భారం తగ్గించాలని, లేకుంటే విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఇద్దరేసి సోషల్‌స్టడీస్ ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలన్నారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంఘికశాస్త్ర దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని వారు పిలుపు నిచ్చారు. జిల్లా ఆర్గనైజింగ్ కన్వీనర్లు మక్కా శ్రీనివాసరావు, ఎల్.గుణశేఖర్ మాట్లాడుతూ సాంఘికశాస్త్ర సిలబస్ పరిధిని దృష్టిలో పెట్టుకొని పని సర్దుబాటు నుంచి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను మినహాయింపు ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రతినిధులు ఆర్.అన్నాజీరావు, పీవీఆర్. మూర్తి, టి.రమణ సీహెచ్ సుబ్బలక్ష్మి, ఎస్.స్వప్న, బి.ముకుందరావు, కె.సంతోష్‌కుమార్, జి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ



కిమ్స్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకూ గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ కిల్లి సతీష్, డాక్టర్ కల్యాణ చక్రవర్తిలు మాట్లాడుతూ గుండె వ్యాధులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ మంచి జీవనశైలి, చక్కటి ఆహార అలవాట్లు, వ్యాయామం, యోగా చేయడం ద్వారా గుండె జబ్బులకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు మానుకోవాలని సూచించారు. కిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డా.గూడేన సోమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మొట్టమొదట గుండె జబ్బులకు వైద్యసేవలు అందించిన ఆస్పత్రి కిమ్స్ అని, అన్ని రకాల గుండె వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పథకం ద్వారా వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ర్యాలీలో కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీఆర్ సోమేశ్వరరావు, ఆపరేషన్స్ వేదవతి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్ర్

పర్లాకిమిడి: బీటెక్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, తద్వారా ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్ర్ అన్నారు. ఆదివారం సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంచూరియన్ వర్సిటీలో స్మార్ట్ వ్యవసాయం, పశువైద్యం, ఫార్మసీ, నర్సింగ్, ఇంజినీరింగ్‌తో పాటు మరికొన్ని కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ప్రజ్ఞాపాణి, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి, మనోజ్ కుమార్ బిశ్వాల్, జనరల్ మేనేజర్ ఫాల్గుణరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.కామేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

• నలభై ఏళ్లకు కలిశారు..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979-80లో చదివిన వారు ఆదివారం మళ్లీ కలిశారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకుని సందడిగా గడిపారు. - కాశీబుగ్గ

• నాటి రోజులు గుర్తు చేసుకుంటూ..



వారంతా ఒకప్పుడు సైనికులు. దేశం రక్షణలో భాగంగా భారతీయ సైన్యంలో పనిచేసిన వీరులు. ఉద్యోగ విరమణ అనంతరం మళ్లీ ఆదివారం ఒక్క చోటకు చేరారు. శ్రీకాకుళంలోని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి నాటి రోజులు గుర్తు చేసుకున్నారు. - శ్రీకాకుళం న్యూకాలనీ